క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



కడియం హైస్కూలు ఆవరణలో మొక్క నాటుతున్న సమగ్ర శిక్ష జిల్లా పీడీ సుభాషిణి

కడియం: పర్యావరణాన్ని పరిరక్షించడం సమష్టి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సమగ్ర శిక్ష జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎస్.సుభాషిణి అన్నారు. శిక్ష సప్తాహ్ ఆరో రోజు కార్యక్రమంలో భాగంగా కడియంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయుడు టి.సత్యనారాయణ అధ్యక్షతన ఎకో క్లబ్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లులతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. ఏఎల్ఎస్‌టీ కె.ఎస్తేరు రాణి, ఎంఈవోలు వై.నాగేశ్వరరావు, ఎంఎస్ మణికుమార్ హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. సందర్భంగా గ్రీన్ కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మొక్కల్ని పిల్లల్లా పెంచితే, అవి తల్లుల్లాగా ఆదరిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి తన పుట్టిన రోజున ఒక మొక్క నాటాలని కోరారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ సిబ్బంది జి.మణిదీప విద్యార్థులకు ఒక్కొక్క మొక్కను దత్తత ఇచ్చారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో ఆదివారం నగరంలోని పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ బత్తిన నగర్, ఆల్వాల్ నగర్, ఇండస్ట్రియల్ ఏరియా, స్వరూప్ నగర్, సాయి దుర్గా నగర్, నారాయణపురం, సైక్లోన్ కాలనీ, గాదిరెడ్డి నగర్ ఏరియాలో విద్యుత్ ఉండదన్నారు.

మిల్కీ మష్రూమ్స్ ప్రదర్శన

కంబాలచెరువు: స్థానిక ఆర్ట్స్ కళాశాలలో మైక్రో బయాలజీ విభాగం అధ్యాపకులు టి.సోనీ, టి.సుజాతల ఆధ్వర్యంలో విద్యార్థులు మిల్కీ మష్రూమ్స్ పెంపకంపై శనివారం కార్యక్రమం నిర్వహించారు. శిక్షణను పొంది విజయవంతంగా మష్రూమ్స్ పండించి, అధ్యాపకులు విద్యార్థులతో కలిసి ప్రిన్సిపల్ చాంబర్‌లో ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ ఉపాధి నైపుణ్యాలను పెంచేలా విద్యార్థులకు శిక్షణ కార్యక్రమాలను అందించాలన్నారు. టి.సోని మాట్లాడుతూ మిల్కీ మష్రూమ్స్ ఒక అరుదైన జాతి అని, ఇటీవల వీటిపై ప్రజలకు బాగా అవగాహన పెరిగిందన్నారు. వీటిలో ఎన్నో పోషకాలు, ఔషధ గుణాలు, ఎక్కువ ప్రోటీన్స్, విటమిన్లు, పీచు పదార్థం ఉందన్నారు.

నర్సరీ సందర్శన



జగపతిబాబుకు స్వాగతం పలుకుతున్న నర్సరీ రైతులు

కడియం: స్థానిక పల్ల వెంకన్న నర్సరీని ప్రముఖ సినీనటుడు జగపతిబాబు శనివారం సందర్శించారు. ఆయనకు నర్సరీ అధినేతలు పల్ల సత్యనారాయణ, పల్ల సుబ్రహ్మణ్యం, పల్ల గణపతి మొక్కను అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. నర్సరీలోని వివిధ రకాల మొక్కల గురించి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో వెంకటేష్, వినయ్ పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



జడ్జి రవినాథ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

కంబాలచెరువు: జిల్లాకు విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి తిలారి రవినాథ్‌ను స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో శనివారం ఎస్పీ డి.నరసింహ కిషోర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

ఎరువుల సీజ్

సీతానగరం: చినకొండేపూడిలోని సిద్ధి వినాయక ఎంటర్ ప్రైజెస్ ఎరువులు, పురుగు మందుల దుకాణంలో శనివారం విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎ.జగన్నాథరెడ్డి, సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిల్వలకు, పుస్తకంలో లెక్కలకు తేడా ఉండడంతో రూ.72 వేల విలువైన ఎరువులను సీజ్ చేశారు. వ్యవసాయశాఖ అనుమతి లేకుండా ఎరువుల గోడౌన్ లో పురుగు మందుల నిల్వ ఉంచడంతో 682.5 కిలోలు, 610 లీటర్ల పురుగుమందును 15 రోజుల వరకు అమ్మకాలు జరపకుండా నిలుపుదల చేశారు. వీటి విలువ రూ.11,34,068 ఉంటుందని తెలిపారు.

వరదతో పోటెత్తిన గోదావరి

- ఉధృతంగా నీటి ప్రవాహం
- రామపాదాలరేవు వద్ద రక్షణ ఏర్పాట్లు
- నీటిలోకి దిగొద్దని ప్రజలకు హెచ్చరిక



రామపాదాల రేవు వద్ద ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్న గోదావరి

ధవళేశ్వరం: గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రెండవ ప్రమాద హెచ్చరిక దాటి ప్రవహిస్తోంది. వరద ఉధృతికి గజఈతగాళ్లే ఇబ్బంది పడుతున్న పరిస్థితి. ధవళేశ్వరం స్నాన ఘట్టాల వద్ద ప్రమాద స్థాయిలో నీటి ఉధృతి కొనసాగుతోంది. దీంతో పంచాయతీ, పోలీసు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. నీటి ఉధృతి అధికంగా ఉన్న ఈ సమయంలో స్నాన ఘట్టాల వద్ద ఎవరూ నీటిలోకి దిగవద్దని హెచ్చరించారు. స్నానాలు చేయడం, బట్టలు ఉతకడం నిషేధమన్నారు.

స్నానాలకు దిగితే ప్రమాదం

ప్రస్తుతం కాటన్ బ్యారేజీ నుంచి 13.06 లక్షల క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. బ్యారేజీకి కేవలం కిలోమీటరు దూరంలో ఉన్న ఈ ఘాట్ల వద్ద నీటి ఉధృతి చాలా ఎక్కువగా ఉంటుంది. గజఈతగాళ్ల కూడా ఈ నీటి ప్రవాహానికి ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లోనూ కొందరు యువకులు నిబంధనలను ఉల్లఘించి స్నానాలకు దిగడం భయాందోళన కలిగిస్తోంది. ఆనందం మాటున విషాదం చోటు చేసుకునే ప్రమాదం ఉందని, ఎవరూ స్నానాలకు దిగవద్దని అధికారులు సూచిస్తున్నారు.

రామపాదాల రేవులో ప్రత్యేక ఏర్పాట్లు

గోదావరి వరదను దృష్టిలో ఉంచుకుని స్థానిక రామపాదాలరేవులో ప్రత్యేక రక్షణ ఏర్పాట్లు చేశారు. రేవులోకి దిగకుండా ధవళేశ్వరం పంచాయతీ అధికారులు గ్రిల్స్‌ను అడ్డుగా పెట్టారు. ప్రతి రోజూ ఈ రేవులో వందల మంది పుణ్య స్నానాలు ఆచరించేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు, సందర్శకులకు ఇక్కడ పోలీసు, పంచాయతీ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అలాగే ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ వద్ద కూడా ప్రత్యేక బందోబస్తు నిర్వహిస్తున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు నిబంధనలు పాటించాలి. వరద ఉధృతి ప్రమాదకర స్థాయిలో ఉంది. ఈ సమయంలో నీటిలోకి దిగడం అపాయం. నిబంధనలను ఉల్లంఘిస్తే రేవులో దిగిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– జీవీ వినయ్‌మోహన్, ధవళేశ్వరం సీఐ



రామపాదాల రేవు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు



స్నాన ఘట్టాల్లోకి దిగకుండా ఏర్పాటు చేసిన రక్షణ ఏర్పాట్లు

ముంపు ప్రాంతాలలో పారిశుధ్య పనులు



రూరల్ ప్రాంతంలో పర్యటిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ధవళేశ్వరం: రాజమహేంద్రవరం రూరల్ మండలంలోని ముంపు ప్రాంతాలలో వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఆమె శనివారం కార్పొరేషన్ కమిషనర్ కేతన్ గార్గ్‌తో కలిసి ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఆవ చానల్ నుంచి గోదావరిలోకి పంపుతున్న నీటితో రూరల్ పరిధిలోని పలు ప్రాంతాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసేందుకు పర్యటన చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఆర్‌అండ్‌బీ కల్వర్టు నిర్మాణం, శానిటేషన్ పనులను చేపట్టడంతో పాటు, గోదావరి పరివాహక ప్రాంతం, గట్టు, ఇరిగేషన్ కాలువ ప్రాంతాలలో ఆక్రమణలను తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో డి.శ్రీనివాస్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

దుళ్ల హైస్కూల్లో రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొడుతున్న మాజీ సర్పంచ్ సత్యనారాయణ

కడియం: దుళ్ల హైస్కూళ్లలో రూ.10 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు గ్రామానికి చెందిన యన్నమని లక్ష్మీపతి ముందుకు వచ్చారు. ఆయన తల్లిదండ్రులు శ్రీరాములు, సావిత్రి పేరిట ఈ కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఆయన శనివారం వెల్లడించారు. ఈ మేరకు పనులను స్థానిక నాయకులు కొబ్బరికాయలు కొట్టి ప్రారంభించారు. ప్రహరీ ఎత్తు పెంచడం, కిచెన్ షెడ్డుకు గోడలు నిర్మించడం, మరుగుదొడ్ల వద్ద చప్టా నిర్మాణం, ఆశ్రమ పాఠశాల తరహాలో ఏర్పాట్లు చేయడం, మినీ స్టేజీ ఏర్పాటు, ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యార్థుల బెంచీలకు మరమ్మతులు చేయనున్నట్టు లక్ష్మీపతి తెలిపారు. కార్యక్రమంలో లక్ష్మీపతి, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఈదర నందేశ్వరరావు, స్థానిక నాయకులు చిట్టూరి వెంకన్న, కోసూరి లక్ష్మీనారాయణ, వట్టి శివ, హెచ్‌ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పర్యావరణ రక్షణ అందరి బాధ్యత



విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న కలెక్టర్ ప్రశాంతి

కంబాలచెరువు: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక ఇన్నిసుపేటలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం జరిగిన శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు మొక్కల పెంపకంపై ఆసక్తి కలిగి ఉండాలన్నారు. ప్రతి పాఠశాలలోనూ ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా మానివేయాలన్నారు. అనంతరం విద్యాశాఖాధికారులు, విద్యార్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. వాటిని విద్యార్థినులు నందిని, ప్రశాంతి, అక్షయలకు దత్తత ఇచ్చి, వాటిని శ్రద్ధంగా పెంచే బాధ్యతను అప్పగించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, సమగ్ర శిక్షా ఏపీసీ ఎస్.సుభాషిణి, ఏఎంవో గౌరీశంకర్, రాజమహేంద్రవరం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఈవీబీఎన్ నారాయణ, అర్బన్ రేంజ్ డీఐ బి.దిలీప్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.శారదాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డైట్ ఛాత్రోపాధ్యాయులకు పుస్తకాల పంపిణీ



దాతలు అందించిన పుస్తకాలతో ఛాత్రోపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: డైట్ 2024–26 బ్యాచ్‌లో ప్రతిభ కలిగిన 20 మంది ఛాత్రోపాధ్యాయులకు విద్యా వికాస్ సొసైటీ ఆధ్వర్యంలో దాత, యూనియన్ బ్యాంకు విశ్రాంత మేనేజర్ ముత్యాల సూర్యనారాయణ పుస్తకాలు పంపిణీ చేశారు. ఒకొక్కరికి రూ.వెయ్యి విలువైన పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిధిగా మాజీ ఎంపీ మిడియం బాబూరావు హాజరయ్యారు. ప్రతిభను ప్రోత్సహించడమే తమ సొసైటీ లక్ష్యమని, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ముత్యాల సూర్యనారాయణ దాతృత్వంతో నిర్విఘ్నంగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని కో ఆర్డినేటర్ జి.కోటేశ్వరరావు తెలిపారు. త్వరలో విద్యావికాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఛాత్రోపాధ్యాయులకు జీకే, వ్యాసరచన, వక్తృత్వం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని వెల్లడించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎం జయశ్రీ మాట్లాడుతూ ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకుని జ్ఞానాన్ని సుసంపన్నం చేసుకోవాలని ఛాత్రోపాధ్యాయులకు సూచించారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం



బస్సులను ప్రారంభిస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ బస్సులలో ప్రయాణం సురక్షితమైందని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఆర్టీసీ ఎప్పుడూ ముందుంటుందని సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో రాజమహేంద్రవరం–ఏలూరు, రాజమహేంద్రవరం– కాకినాడలకు శనివారం నూతన బస్సు సర్వీసులను ఆయన ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో రెండు బస్సుల సర్వీసులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో డీపీటీఓ కె.షర్మిల అశోక, డిపో మేనేజర్ ఎస్‌కే షబ్బం తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అన్ని వసతులు

భారీ వర్షాలు, గోదావరి వరద కారణంగా పునరావాస కేంద్రాలలో తలదాచుకుంటున్న బాధితులకు అన్ని సౌకర్యాలు కల్పించామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాసు అన్నారు. చందా సత్రంలోని పునరావాస కేంద్రంలో ఉంటున్న వరద బాధితులను శనివారం ఆయన పరామర్శించారు.

అబ్దుల్ కలాం సేవలు చిరస్మరణీయం



అబ్దుల్ కలాం వర్ధంతిలో పాల్గొన్న ఆదిత్య వలంటీర్లు

కంబాలచెరువు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని వక్తలు కొనియాడారు. నగరంలోని పలు ప్రాంతాలలో శనివారం ఆయన వర్ధంతి నిర్వహించారు. స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్ల ఆధ్వర్యంలో మాజీ రాష్ట్రపతికి నివాళులు అర్పించారు. నందం గనిరాజు సెంటర్‌లోని ఆయన విగ్రహానికి రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి పూలమాలలు వేశారు. ప్రిన్సిపాళ్లు సీహెచ్ ఫణికుమార్ ఎస్‌కేఎస్ రెహమాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు, డాక్టర్ బి.రమాదేవి, మహేశ్వరి పాల్గొన్నారు.
= ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అబ్దుల్ కలాంకు నివాళులర్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్‌కే మాట్లాడుతూ అబ్దుల్ కలాం జీవితం విద్యార్థులకు ఆదర్శ ప్రాయమన్నారు. ఆయన మార్గంలో నడిచి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఇ.చంద్ర శేఖర్, భౌతిక శాస్త్ర విభాగాధిపతి సీహెచ్ కోమలలక్ష్మి, భౌతిక శాస్త్ర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజధానికి ఇచ్చింది రుణమే..



విలేకరులతో మాట్లాడుతున్న మాట్లాడుతున్న శైలజానాథ్

రాజమహేంద్రవరం సిటీ: అమరావతి నిర్మాణానికి ఎన్‌డీఏ ప్రభుత్వం రూ.15 వేల కోట్లు ఇచ్చిందంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంబరాలు చేసుకుంటున్నారని, అయితే కేంద్రం ఇచ్చింది రుణమే తప్ప గ్రాంట్ కాదని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌తో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. బీహార్‌కు ప్రత్యేక హోదా అడుగుతుంటే, ఏపీ విషయంలో మాత్రం ప్రత్యేక హోదా ఊసేలేదన్నారు. పోలవరానికి మూడేళ్లలో రూ.18 వేల కోట్లు ఇస్తామని ప్రకటన చేశారే తప్ప, ఏ విధంగా ఇస్తారన్న దానిపైనా స్పష్టత లేదన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరించబోమని ఆర్థిక మంత్రి పార్లమెంట్‌లో ప్రకటన చేయలేదన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ



శ్రీరంగపట్నంలో నిత్యావసరాలు అందజేస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్

మధురపూడి: అధిక వర్షాలు, వరదల కారణంగా శ్రీరంగపట్నంలో ఇళ్లు దెబ్బతిన్న వారికి శనివారం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్ భరత్ నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎర్రకాలువ, గోదావరి వరద కారణంగా జిల్లాలో 1,421 కుటుంబాలు ముంపునకు గురయ్యాయన్నారు. ఈ నేపథ్యంలో బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా శ్రీరంగపట్నంలోని ఐదు కుటుంబాలకు ఒక్కొక్కరికి 25 కేజీల బియ్యం, ఒక లీటర్ పామాయిల్, కిలో చొప్పున కంది పప్పు, బంగాళాదుంపలు, ఉల్లిపాయలు అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ డి.రాజ్యలక్ష్మి, మద్దాల రమణ, బుద్దా బాపూజీ, అప్పల నర్సయ్య, వీఆర్వో కర్రి రాజు పాల్గొన్నారు.

డొల్లతనం.. తేటతెల్లం..

- అధ్వానంగా జాతీయ రహదారి
- అడుగడుగునా గోతులు
- ప్రయాణానికి అవస్థలు



జాతీయ రహదారిపై డైట్ కళాశాల వద్ద పడిన గోతులు



డివైడర్ పక్కకు చేరిన గోతులలోని తారు, కంకర మిశ్రమం

రాజానగరం: రోడ్లకు మరమ్మతులు చేపట్టేటప్పుడు నాణ్యతా ప్రమాణాలు పాటించడం చాలా అవసరం. అప్పుడే అవి సక్రమంగా ఉండడంతో పాటు నాలుగు కాలాల పాటు పనిచేస్తాయి. కానీ ఇప్పుడు పనుల్లో నాణ్యత కొరవడింది. పనులు చేసిన ఏడాది తిరగకుండానే మళ్లీ సమస్య మొదలవుతోంది. ముఖ్యంగా రోడ్ల మరమ్మతుల సమయంలో నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. అవి కూడా మారుమూల గ్రామాలలో కాదు. నిత్యం వేలాది వాహనాలు తిరిగే జాతీయ రహదారిపై కూడా మరమ్మతులు సక్రమంగా చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

ప్రయాణమంటే హడలే..

జాతీయ రహదారిపై వాహనాలు నిర్ణీత వేగంతో సర్రున దూసుకుపోవచ్చు. ఒక కార్లలో అయితే వేగంగా, సుఖంగా గమ్యస్థానాలను చేరుకోవచ్చు. ఎక్కడా స్పీడ్ బ్రేకర్లు ఉండవు కాబట్టి బ్రేక్ తొక్కే అవసరమే ఉండదు. కానీ ఇవన్నీ గతంలో అనుకునే మాటలు. ఇప్పుడు జాతీయ రహదారిపై అడుగుకు ఒక గుంత పడింది. వాహనాలు నడపటానికి డ్రైవర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. వేగంగా దూసుకుపోవాల్సిన రోడ్డులో వాహనం నడపడమే కష్టంగా మారిందని వాపోతున్నారు. జాతీయ రహదారిపై ప్రయాణమంటేనే జనం హడలిపోతున్నారు. రహదారికి చిల్లులు పడ్డాయా అన్నట్టుగా అడుగడుగునా గోతులు ఉంటున్నాయి. వేగంగా వెళ్లే వాహనం టైర్లు ఒక్కసారిగా గోతుల్లో పడి ప్రయాణికులను బెంబేలెత్తిస్తున్నాయి.

తరచూ మరమ్మతులు

జాతీయ రహదారిపై గోతులను పూడ్చుతూ సంబంధించి సిబ్బంది ఎప్పుడూ కనిపిస్తారు. నిత్యం ఏదో ఒకమూల మరమ్మతులు జరుగుతూనే ఉంటాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రహదారిపై తారు, కంకర మిశ్రమాన్ని పొరలు పొరలుగా పోస్తూ రహదారికి మెరుగులు దిద్దుతున్నారు. కానీ ఈ పనులలో నాణ్యత లోపించడంతో కొద్ది రోజులకే మళ్లీ మామూలు స్థితికి వచ్చేస్తున్నాయి. వర్షాలు కురిసినప్పుడు గోతులలో తారు, కంకర కొట్టుకుపోయి మళ్లీ యథాతథంగా మారుతున్నాయి. సాధారణంగా జాతీయ రహదారిపై బైకులు, కార్లు, లారీలు వేగంగా దూసుకుపోతుంటాయి. వర్షాల కారణంగా రహదారిపై బయట పడిన గోతులను దగ్గరకు వచ్చే వరకు వాటిని గమనించే అవకాశం ఉండడం లేదు. దీంతో వాటిలో పడి వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి. ఒక్కోసారి ప్రమాదాలకు కూడా దారితీసి, ప్రయాణికులు క్షతగాత్రులవుతున్నారు.

వర్షానికి కొట్టుకుపోతున్నాయి



జాతీయ రహదారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి, మరమ్మతులు చేయడం మంచిదే. కానీ రహదారిని కొబ్బరి కోరినట్టుగా గీతలు పెట్టి, దానిపై తారు, కంకర మిశ్రమాన్ని లేయరుగా పోస్తున్నారు. అయితే ఈ పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో వర్షాలకు ఆ లేయర్లు కొట్టుకుపోతున్నాయి. దీంతో రోడ్లపై గోతులు దర్శనమిస్తున్నాయి.

– ఆర్.గంగారావు, రాజమహేంద్రవరం

నాణ్యత లోపించడమే ప్రధాన కారణం

సాధారణంగా రహదారుల అభివృద్ధి, మరమ్మతు పనులను వేసవిలో చేస్తుంటారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రావులపాలెం నుంచి తుని వరకు సుమారు 130 కిలోమీటర్ల మేర 16వ నంబరు జాతీయ రహదారి విస్తరించిఉంది. ఈ రహదారిని పర్యవేక్షిస్తూ, మరమ్మతు పనులు చేసే బాధ్యతలను వివిధ కంపెనీలు తీసుకున్నాయి. కాలానుగుణంగా ఆయా కంపెనీలు రహదారి మరమ్మతులతో పాటు డివైడర్లపై నాటిన మొక్కల పెంపకానికి కూడా బాధ్యత తీసుకోవాల్సి ఉంటుంది. అయితే ఈ పనులను తూతూమంత్రంగా చేపట్టడంతోనే సమస్యలు వస్తున్నాయి. టోల్‌ఫీజుల పేరుతో వాహనదారుల నుంచి భారీగా సొమ్ములు వసూలు చేస్తున్న వారు.. రహదారుల నిర్వహణను బాధ్యతాయుతంగా నిర్వర్తించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వేసవిలో చేపట్టాల్సిన మరమ్మతులను వర్షాలు కురిసే సమయంలో చేపట్టడం, ఆ పనులలో నాణ్యత లోపించడంతో చేసిన పనులు ఎక్కువ రోజులు ఉండడం లేదు.